కథా నిలయం
5143
శ్రీకాకుళం

# గుజ్జనగూడు



పదిహేను మంది కూర్చోగల మెటాడోర్ వ్యాన్ అది. వ్యాన్ సముద్రపు పక్కమ్మటి పరుగెత్తుతూ ఓ గెస్టహౌస్ ముందాగింది. ముందుగ క్లీనర్ దిగి నిలుచున్న బండి టైర్లకు రాళ్లుంచాడు. "పిల్లలూ దిగండి. కాసేపు ఈ సముద్రం వొడ్డున కూర్చుందాం" అని టీచర్ అనగానే, అందరు వ్యాన్ దిగి సముద్రాన్ని చూసుకుంటూ కెరటాలతో ఆడుకోవడానికి పరుగెత్తుతున్నారు. సాయం సంధ్య, సూర్యుడు సముద్రంలోకి తొంగి చూస్తువుంటే ఎరుపు పసుపును కలిపి వెదజల్లినట్టు అందమైన ఓ కొత్త రంగై అంతటా పరుచుకుంది. దూరం నుండి ఓ నావ తీరం వైపు వస్తూవుంది.

"జాగ్రత్త నీళ్లలోకి వెళ్లకండి, వొడ్డున్నే ఆడుకోండి" అంటూ టీచర్ అటు యిటూ తిరుగుతూ వాళ్లనే కనిపెట్టుకొని చూస్తూ వున్నాడు. పిల్లలు ఆయనంటే ఎందుకో యిష్టపడతారు.

కొందరు కాళ్లతో యిసుకలో గిరి గీసుకొని "యిదినాది" "అది నీది" అని అనుకున్నారు. వయస్సులో అందరికంటే చిన్నవాడు పదేండ్ల పిల్లాడు పేరు రహీం. తన చెప్పులు పక్కకు

వొదిలి యిసుకలో కాలుంచి దాని చుట్టు యిసుకను అదిమి, మెల్లగ కాలును బయటికి లాగాడు. ఓ చక్కని గూడు తయారైంది. పాదాన్ని తీసేటపుడు యిసుక గూడు కూలిపడిపోనందుకు తృప్తిగా దాని వైపు చూస్తూ ఆనందించాడు. దాని పక్క పక్కనే నడుస్తున్న టీచర్ చిరునవ్వు నవ్వుతూ, రహీం వీపును తాకి ముందుకు నడిచాడు. ఈ లోపల నీళ్లలో ఆడి కాళ్లుచేతులను తడుపుకొని వచ్చిన రాము, శివుడు, రహీం దగ్గరికొచ్చి

"ఏమిటి అలలతో ఆడుకోడానికి రాక ఏంచేస్తున్నావు" ? అని ప్రశ్నిస్తూ రహీం కట్టిన యిసుక గూడును కాళ్లతో కూలతొక్కి నడుంకు చేతులు పెట్టుకొని, తుంటరిగా నవ్వుతూ నిలుచున్నారు.

రహీం పడగెత్తే పాములా లేచి రెండు చేతులతో వాళ్లిద్దరి గల్లాలను పట్టుకున్నాడు. రాము, రహీం జుట్టు, శివుడు గల్లా పట్టుకున్నాడు. రహీం తరపున కొందరు, రాము తరపున కొందరు రంగంలోకి దిగారు. మాటా మాటా పెరగడం ఒకర్నొకరు నెట్టుకోవడం తోసుకోవడం, గమనించిన టీచర్ వాళ్లను సమీపించి, "ఏమిటి గోల" అన్నట్టు చూశాడు. రహీం ఉక్రోషంగా ఒగర్చుతూ

"సార్ నా యిసుక గూడుని కూలగొట్టారు యీళ్లిద్దరు" అంటూ కూలిన గూడును చూపించాడు.

అవునా అన్నట్టు వాళ్లిద్దరివైపు చూశాడు టీచర్.

"ఆడు నా స్థలంలో కట్టుకుంటే కూలగొట్టినం" రాము అన్నాడు.

"కాదు నా జాగ" రహీం చెప్పాడు

"కాదు నాది, కావాలంటే శివున్నడగండి"

"అవును సార్; గిరిగీసి పేరు రాసుకొని మేం నీళ్లవైపు పోయినం, వొచ్చేసరికి వీడు గూడు కట్టుకుండు" శివుడు.

వీళ్లు యిటు రానే లేదు నీళ్లవైపే వున్నారు.

"మీరైతే అందర్ని ఆడుకోమన్నారుగా సార్" శివుడు.

" ఆ ఆడుకోమన్నాను కాని ఒకర్ని ఒకరు కొట్టుకోమన్నానా" రాము తలమీద చేయుంచి "నీవు నీళ్లలో ఆడుకుంటే అతను యిసుకలో ఆడుకున్నాడు. అదే అతనికి ఆనందం దానిని నీవెందుకు కూలగొట్టావు ? నీవు చేసిన పని తప్పు కాదూ ?" అన్నాడు టీచర్.

"కాదు సార్ నేను అక్కడ గూడు కట్టుకుందామని గీతగీసి వెళ్లాను కావాలంటే చూడండి, ఈ పక్క మూర్తి, ఆ పక్క శివుడు, మధ్యన వీడు గూడు కట్టేసిన చోటు నాది. నేను లేనిది చూసి కట్టేసినాడు. వీన్ని అక్కడినుండి వెళ్లమనండి" అంటు ముక్కుపుటలెగరేస్తూ చూపులను అరచేతిలో నిలుపుతూ అన్నాడు.

"ఏయ్ వీడు, గీడు మాటలు మంచిగరానీ" రహీం.

"మరి నా చోటులో నువ్వు ఎందుకు కట్టినవోయ్" ఆవేశంగా అన్నాడు రాము.

"సముద్రపు వడ్డంతా ఖాళీగానే వుంది. చూడు పిల్లలు ఎన్ని యిళ్ళు కడతారో కట్టండి. దీనికోసమే ఎందుకు తగవు? మీరిద్దరు ఒకేక్లాసువాళ్ళు ప్రేమగ కలిసి మెలిసి వుండాలి" యిద్దరి తలల మీద తన రెండు చేతులను ఉంచుతు అన్నాడు టీచర్.

"లేదు నాజాగా నాకు కావాలి" కుడిచేతి మణికట్టుతో ముక్కును తుడుచుకుంటూ అన్నాడు, స్థిరమైన చూపులతో రాము.

"లేదు నా గూడు నాకు యిప్పుడే కట్టియ్యాలె" రహీం, పట్టు పట్టాడు.

"మళ్లీ మొదటికొచ్చారు. కాసేపైతే యిక్కడినుండి వెళ్లిపోతాం. ఎందుకంత పట్టుదల, చిన్న విషయాన్ని పెద్దగ చెయ్యొద్దు" అనివారించాడు.

"నేను కష్టపడి కట్టుకున్నాదాన్ని ఒక్కక్షణంలో తొక్కేశాడు. నాది నాకు ఎట్టుందో అట్ట కావాలి అంతే" అని తాను గూడు కట్టినచోటికి వెళ్లి నిలుచున్నాడు రహీం.

"సరే నేను కట్టిస్తానురా" టీచర్ యిసుకవైపు నడిచాడు. నలుగురైదుగురు పిల్లలు టీచర్‌ను అనుసరించారు.

"ఆ నాకు యిక్కడే కావాలి" రహీం హఠం చేస్తూ అన్నాడు.

"అది నాది, నేను కట్టుకోవాలి" రాము మరింత మొండి తనాన్ని ప్రదర్శిస్తూ అన్నాడు.

టీచర్ చిరునవ్వు నవ్వుతూ ఈ సమస్యకు ముగింపు పలకాలని అనుకొని "అందరు వెళ్లి వ్యాన్ ఎక్కండి, మీరు పదండి" అన్నాడు.

"చూడు రామూ ఆ భూమి మీ యిద్దరిలో ఏ ఒక్కరి సొంతం కాదు కాసేపటి కోసం మీరు తమదిగ భావించారు అంతే, అవునా?

అవును అన్నట్టు యిద్దరు తలలూపారు.

"అయితే ఒకడు అక్కడ గూడును కట్టుకున్నాక రెండవవాడు దానికి ఆశ పడకూడదు. ఒకవేళ ముందుగానే అక్కడ తనది అని గీతలు గీసుకుంటే మరొకరు వాటిని చెరిపి గూడు కట్టకూడదు. యివి రెండు జరిగిపోయినవి. యిద్దరిలో మనస్పర్థలను పెంచినయి. అసలు ఆ స్థలం ఎవరిది కాదు. ఆ గూడు ఎప్పటికి వుండదు. అందువల్ల ఆవిషయం మర్చిపోండి, పదండి. మీరు పెద్దవాళ్లు అవుతున్నారు. పెద్దమనస్సుండాలి". అన్నాడు టీచర్.

పిల్లలు మౌనంగా ఆయనవెంట నడుస్తున్నారు. అందరి మనస్సులో రకరకాల ఆలోచనలు.

"పిల్లలూ! మీరు తరగతి గదుల్లో విన్న పాఠాల తీరు వేరు, బయటిప్రపంచంలో ఎదురయ్యే సంఘటనలలో భాగస్వాములన్న విషయం గ్రహించి అనుభవాన్ని గడించాలి".

అందరూ "అవునుసార్" అన్నట్టు మధ్య మధ్య టీచర్‌వైపు చూస్తు నడుస్తున్నారు.

"అనుభవం చాలా గొప్ప దర్పణం, మంచి చెడులను మన కళ్లముందే నిల్పుతుంది ఎవరి నీడ వాళ్ల వెంట వున్నట్టే ఎవరి

అనుభవం వారికి అక్కరొస్తుంది. మనం నేర్చుకునే పాటలు గూడా అనుభవంలోనుంచే పుట్టాయి" అందరు "అవును" అన్నట్టు తలలూపారు.

"చూడండి యిలాంటి చెడు అనుభవాన్ని తిరిగి చవి చూడగూడదు, విన కూడదు".

అందరు వ్యాన్ ఎక్కారు.

క్లీనర్ "రైట్" అన్నాడు. వ్యాన్ కదిలింది.

తీరం వైపు వస్తున్న పడవ వడ్డుకు చేరువైతుంది.

పడవ నడిపేవాడు పాట పాడుతున్నాడు, చక్కని రాగం, చక్కని భావం !

"మనిషికి - మనిషే తోడురా

మంచి మనిషితోడే ఓ నీడరా -"

వ్యాను వేగం పెరిగింది ఆ పాట రాగం దూరమైంది.

"పాట వింటున్నారా" టీచర్ అడిగాడు.

వింటున్నాం అన్నట్టు అందరు తలలూపారు.

"బాగుంది సార్" మూర్తి, రహీం ఒకేసారి అన్నారు.

ఆ పాటలో చక్కని సాహిత్యం వుంది. ఆలోచింపచేసే మంచి భావమూవుంది. గుండెకు హత్తుకుపోయే రాగము వుంది".

"అయితే కాసేపు ఆగి పాటను పూర్తిగ వినవల్సింది" డ్రైవర్ అన్నాడు.

అవును అన్నట్టు తలవూపి, అదేరాగాన్ని ఆలాపనలా పలువరిస్తున్నాడు టీచర్.

చెట్లమీదనుండి పరుగెత్తుకొస్తున్న చల్లగాలి, సువాసనలు, మోసుకొస్తుంటే పక్షుల అరుపులు చెవుల కింపుగా వినిపిస్తున్నాయి.

అద్దంలో ముఖం చూసుకుంటున్నట్టు సముద్రంలో ఆకాశం. పసుపు పూసుకున్న ముఖానికి ఎర్రటి కుంకుమ బొట్టులాగ అస్తమించబోయే సూర్యుడు.

●